# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

30.01.2026 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 202 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సమ్మక్క గద్దెలపై కొలువుదీరారు. అంతకుముందు వనం (చిలకలగుట్ట) వీడి జనంలోకి సమ్మక్క ఆగమనం ప్రారంభమవడంతో సమ్మక్క తల్లికి గౌరవసూచకంగా గాల్లోకి ములుగు జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తుల పూనకాలు వచ్చాయి.

## మేడారం గిరిజనుల మహాకుంభమేళా

- దేశంలనే అతి పెద్ద గిరిజనుల పండగ
- కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరం
- కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద పూజలు

2



మేడారం సమ్మక్క-సారక్క జాతరను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోందని జువల్ ఓరం అన్నారు.

## అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా లక్ష్యం

- రాజస్థాన్, గుజరాత్ విధానాలు అధ్యయనం చేయాలి
- సీఎస్ రామకృష్ణారావు

2



రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.



## దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

- ఐరోపా ఒప్పందంపై మోడీ
- రాష్ట్రపతి ప్రసంగం ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబించిందని వ్యాఖ్య

4




## మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులపై ఈసీ యాప్

- రాష్ట్ర ఎన్నికల సంఘం

2

## పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

శాస్త్రీయ విధానంతో గాలి నాణ్యతపై తెలంగాణ దృష్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పిం చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## జీడీపీ వృద్ధి

- పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే
- ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

4





## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

- ఇద్దరు మావోల మృతి

2



## స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

- కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు
- టీవీ సీరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్
- మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

04



## అదృష్టంతో విజయం వరించదు

కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం

- గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానమే లక్ష్యం
- హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సీఎం రేవంత్

**విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో విద్యార్థులకు బోధించారు. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు సీఎం రేవంత్ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు.**

**హైదరాబాద్, జనవరి 29:** హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సీఎం రేవంత్ తన ఆలోచనలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశర చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లో నూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక

మిగతా 2 లో



## మామునూరు కల సాకారం

- సీఎం చొరవతోనే సాధ్యమైంది
- కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

2

## కేసీఆర్‌కు బిగ్‌షాక్

### ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు

నేటి మధ్యాహ్నం విచారణ చేపడతామని వెల్లడి





**హైదరాబాద్, జనవరి 29:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఇప్పటి వరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్‌నూ విచారించాలని సిట్ నిర్ణయించింది.

మిగతా 2 లో

## నేటి విచారణకు రాలేను..

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. శుక్రవారం జరగాల్సిన విచారణకు తాను హాజరు కాలేనని స్పష్టం చేస్తూ జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి ఆయన రెండు పేజీల లేఖ రాశారు.



- మున్సిపల్ ఎన్నికలతో బిజీగా ఉన్నా
- సిట్ నోటీసులకు కేసీఆర్ సమాధానం

2



# అదృష్టంతో విజయం వరించదు

మొదటి పేజీ తరువాయి

వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశర చేశారు. భారతీయ యువత మేధస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

# కేసీఆర్‌కు బిగ్‌షాక్

మొదటి పేజీ తరువాయి

ఇందులో భాగంగానే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

# నేటి విచారణకు రాలేను..

## ముని్సపల్ ఎన్నికలతో బిజీగా ఉన్నా

## సిట్ నోటీసులకు కేసీఆర్ సమాధానం



**హైదరాబాద్, జనవరి 29:** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. శుక్రవారం జరగాల్సిన విచారణకు తాను హాజరు కాలేనని స్పష్టం చేస్తూ జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి ఆయన రెండు పేజీల లేఖ రాశారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోందని, శుక్రవారమే నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులకు బీ-ఫాంలు కేటాయించే పనిలో తాను నిమగ్నమై ఉన్నానని కేసీఆర్ ఆ లేఖలో వివరించారు. ఈ అత్యవసర రాజకీయ కారణాల దృష్ట్యా విచారణను మరో రోజుకు వాయిదా వేయాలని ఆయన కోరారు. లేఖలో కేసీఆర్ విచారణా నిబంధనలను ప్రధానంగా ప్రస్తావించారు. 160 సీఆర్‌పీసీ నిబంధనల ప్రకారం 65 ఏళ్లు పైబడిన పురుషులు విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, విచారణాధికారులే వారి నివాసానికి వెళ్లి వివరాలు సేకరించాలని గుర్తు చేశారు. అలాగే తన నివాసం ప్రస్తుతం ఎర్రవల్లిలో ఉన్నందున, ఇకపై తనకు పంపే నోటీసులను అక్కడికే పంపాలని, విచారణ కూడా ఎర్రవల్లిలోనే చేపట్టాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా విచారణకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ముందస్తు నోటీసులు ఇచ్చి, తన నివాసం వద్దే విచారణ జరిపేలా తదుపరి చర్యలు తీసుకోవాలని సిట్ అధికారులకు పంపిన ప్రత్యుత్తరంలో ఆయన స్పష్టం చేశారు.

# ఛత్తీస్‌గఢ్ ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోల మృతి

**రాయ్‌పూర్, జనవరి 29:** ఛత్తీస్‌గఢ్ మరోమారు రక్తమోడింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించినట్లు అధికారులు తెలిపారు. బీజాపూర్ జిల్లా దక్షిణ భాగంలోని అడవీ ప్రాంతంలో గురువారం ఉదయం 7.00గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుండి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను, ఎకె47 రైఫిల్, 9ఎంఎం పిస్టల్, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ కొనసాగుతోందని అన్నారు. జనవరి 3న బస్తర్ ప్రాంతంలోని బీజాపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పద్నాలుగు మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో సుమారు 22మంది మావోయిస్టులు మరణించారు.

# మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులపై ఈసీ యాప్ ప్రారంభం

**హైదరాబాద్,జనవరి 29:** తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అలాగే.. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్ఈసీ పేర్కొంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పక్రియ ప్రారంభమైంది. మొత్తం 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్లకు అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

## శాస్త్రీయ విధానంతో గాలి నాణ్యతపై దృష్టి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, జనవరి 29:** పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'గాలి నాణ్యత సూచీ-గాలి నాణ్యత నిర్వహణ' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ఎదురెదురుగా కాకుండా చేతులు కలిపి ముందుకు సాగాలన్నారు. హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా వేగంగా ఎదుగుతున్న నగరమని, అదే సమయంలో నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాల్సిన అవసరం ఉందన్నారు. శుభ్రమైన గాలి కేవలం పర్యావరణ అంశమే కాకుండా ప్రజారోగ్యం, ఉత్పాదకత, ఆర్థిక వృద్ధితో నేరుగా ముడిపడి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా రియల్‌టైమ్, విశ్వసనీయ డేటా లభిస్తుందన్నారు. 2025 గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళిక ద్వారా వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి కాలుష్య మూలాలపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలు, ఈ-బస్సులు, మెట్రో విస్తరణ, ఛార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టామని చెప్పారు. 2030 నాటికి సౌర, గాలి, గ్రీన్ హైడ్రజన్ ద్వారా 20 వేల మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పరిశ్రమల వల్ల సుమారు 32 శాతం కాలుష్యం ఉత్పన్నమవుతోందని అధ్యయనాలు వెల్లడించాయన్నారు. ఒకప్పుడు నగర అంచున ఉన్న పరిశ్రమలు ఇప్పుడు నివాస ప్రాంతాల మధ్యకి రావడం వల్ల ప్రజల భద్రత, ఆరోగ్యంపై తీవ్రమైన ప్రమాదాలు ఏర్పడుతున్నాయని హెచ్చరించారు. పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ, జోనింగ్ సంస్కరణలు, భూ వినియోగ ప్రణాళికలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే గాలి నాణ్యత డ్యాష్‌బోర్డును త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక చర్యల బృందాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించి, ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సూచనలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా అమలు చేయాలని కోరారు.

# గిరిజనుల మహాకుంభమేళా మేడారం

## దేశంలనే అతి పెద్ద గిరజనుల పండగ

## కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం

## కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల పూజలు



**మేడారం, జనవరి 29:** మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు,డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు పీఎం జన్-మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి 80 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్లు, ఈ ఏడాది జాతర నిర్వహణకు 3.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సమ్మక్క-సారక్క పేరుతో 890 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించు కుంటామని వెల్లడించారు. లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# మామునూరు కల సాకారం

- సీఎం చొరవతోనే సాధ్యమైంది
- కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్,జనవరి 29 :** రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చొరవ వల్లే మమునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం రాకముందు మమునూరు అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌గా ఉండేదని అన్నారు. మమునూరు ఎయిర్‌పోర్ట్‌కు 696 ఎకరాలు మాత్రమే ఉందని, అయితే 180 సీట్ల విమానం దిగాలి అంటే రన్ వే పొడవు 2500 మీటర్లు ఉండాలని మంత్రి తెలిపారు. మునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరాలంటే మరో 259ఎకరాలు అవసరమని మంత్రి తెలిపారు. గతంలో ఎవరూ ఆ భూమిని సేకరించలేదని, అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రికార్డ్ టైమ్‌లో రైతులను ఒప్పించి భూమి సేకరించిందని ప్రశంసించారు. ఏవియేషన్ మంత్రిగా ఎక్కువ ఎయిర్-పోర్ట్‌లు నిర్మించాలనేది తన లక్ష్యమని, రాష్ట్రాలు సహకరించి భూములు ఇస్తే కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తర్వాత గొప్ప వారసత్వ నగరమైన వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా.. నిర్మాణం చేసుకోలేక పోయామని, ఇప్పుడు ఆ కల నెరవేరుతోందని అన్నారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ 5వేల ఎకరాల్లో నిర్మిస్తామంటే అందరూ నవ్వారని, అన్ని వేల ఎకరాలు ఉండటం వల్లే నేడు ఆపరేషన్, మెయింటెనెన్స్, రిపేర్ కేంద్రాలకు వీలు అవుతోందని మంత్రి పేర్కొన్నారు. అందువల్లే హైదరాబాద్ ఏవియేషన్ హబ్‌గా ఎదిగిందన్నారు. పోటీపడి రాజకీయాలు చేయడం కాదు.. అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు నేర్పించారని అన్నారు. తెలంగాణను కూడా అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు చెప్పారని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా లక్ష్యం

## రాజస్థాన్, గుజరాత్‌ను అధ్యయనం చేయాలి

## సీఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, జనవరి 29:** రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఆదేశించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఇంధన, వైద్య ఆరోగ్య, ఐటీ, పరిశ్రమలు, మైన్స్, టీజీఐఐసీ, ఫ్యూచర్ సిటీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల ఉన్నతాధికారులతో సవివర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీజీ ఎస్పిడిసిఎల్, టీజీ ఎన్‌పిడిసిఎల్‌లలో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యుత్ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్‌నగర్, పరిగి ప్రాంతాల్లో ప్రతిపాదించిన సబ్‌స్టేషన్ల పనుల పురోగతిని పరిశీలించారు. అండర్‌గ్రౌండ్ కేబులింగ్, ఈ-గవర్నెన్స్, విజన్‌ఉ2047 లక్ష్యాలపై అధికారులతో చర్చించారు. వైద్య రంగంలో వరంగల్, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రుల విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత, మందుల సరఫరా, వైద్యులు, నర్సుల నియామకాలు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ, దూర ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఐటీ శాఖలో డిజిటల్ గవర్నెన్స్, పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రవ్యాప్తంగా ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణపై సమీక్షించారు. ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా ప్రజలకు అందించేలా ఐటీని వినియోగించాలని ఆదేశించారు. మైన్స్ శాఖలో ఇసుక సరఫరా, సాండ్ రీచ్‌లలో సీసీటీవీల ఏర్పాటు, ఫ్యూచర్ సిటీ, టీజీఐఐసీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, మెట్రో వాటర్ వర్క్స్ ప్రాజెక్టుల పురోగతిపై కూడా సీఎస్ సమీక్షించారు. ఈ సమావేశంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, శాఖల కార్యదర్శులు, సీఎండీలు, కమిషనర్లు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు నోటీసులు కక్షసాధింపు చర్య

- ఇది ప్రతీకారం తప్ప మరోటి కాదు
- ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, జనవరి 29:** విచారణల పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, నోటీసులతో చరిత్రను చెరిపేయలేరని కేటీఆర్ వెల్లడించారు. ఇది విచారణ కాదు.. ఇది ప్రతీకారం. ఇది న్యాయం కాదు.. ఇది రాజకీయ దురుద్దేశం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే



తగిన గుణపాఠం చెబుతారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది.' చావు నోట్లో తలబెట్టి.. కేసీఆర్ సచ్చుడో – తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్దాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం' అని కేటీఆర్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్ట

- రేవంత్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు ఆగ్రహం
- మండిపడ్డ పలువురు మాజీ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, జనవరి 29 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీచేయడంపై ఆ పార్టీ వర్గాలు మండిపడ్డాయి. ఇది పూర్తిగా కక్షపూరిత రాజకీయమని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే అని హెచ్చరించారు. ఈ మేరకు హరీష్‌రావు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు తన పోస్టులో పేర్కొన్నారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం అంటే సూర్యునిపై ఉమ్మి వేసే ప్రయత్నమేనని మండిపడ్డారు. పరిపాలనలో చేతకానితనంతో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు, సిట్ పేరుతో నోటీసులు జారీచేయడం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని హరీష్‌రావు విమర్శించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ది పొందవచ్చని భావించడం రేవంత్‌రెడ్డి రాజకీయ దివాళాకోరు తనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. చరిత్రను సృష్టించిన నాయకుడు కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని హరీష్‌రావు మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు ఇదే నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ అధికార దుర్వినియోగనికి పరాకాష్ట అని మండిపడ్డారు. పరిపాలన విధివిధానాలు తెలియని వాళ్లు పాలకులుగా ఉండటం దురదృష్టకరమని.. నియంతృత్వ పోకడలకు ప్రజలే అడ్డుకట్టవేస్తారని క్రాంతి కిరణ్ అన్నారు. కేసీఆర్ కీర్తిని దిగజార్చాలనే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ నోటీసులు జారీ చేసిందని మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ తెచ్చిన ధీరుడికి కేసులు, కొట్లాట, కోర్టులు కొత్తకాదు అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడిన వీరుడు కేసీఆర్. ఈ కాంగ్రెస్ నేతల సిట్, బొట్‌లకు భయపడబోరన్నారు. న్యాయస్థానాల మీద, వ్యవస్థ మీద నమ్మకం ఉందన్నారు. కమిషన్లు, సిట్‌లు, కేసులులకు అదరం బెదరమన్నారు. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పలేకనే సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపారని మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులపై ఆయన స్పందించారు. కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్య సాధింపు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ వరుస స్కాంల నుంచి దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు ఇచ్చిందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉంటారు. కేసీఆర్ వెంట తెలంగాణ సమాజం అంతా ఉంది. మీ కేసులకు, నోటీసులకు భయపడేది లేదు. అక్రమ కేసులపై ప్రజా క్షేత్రంలోనే బీఆర్ఎస్ తేల్చుకుంటుందని స్పష్టం చేశారు.

# చైన్ స్నాచింగ్‌లపై అవాస్తవ ప్రచారాలు

**సోషల్ మీడియా పుకార్లపై కమిషన్ సజ్జన్నార్**






**హైదరాబాద్, జనవరి 29:** బంగారం రేట్లు పెరగడంతో చైన్ స్నాచింగ్‌లు విపరీతంగా పెరిగిపోయాయని, అంతర్రాష్ట్ర ముఠాలు హైదరాబాద్‌లో మకాం వేశాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నమ్మవద్దని అదంతా ఉత్తిదే అని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. ఇలాంటి ప్రచారాలు రావడంపై ఆయన స్పందించారు. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటివి నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు. దయచేసి సోషల్ మీడియాలో వచ్చే ధ్రువీకరించని వార్తలను, భయపెట్టే పోస్టులను ఫార్వార్డ్ చేయకండి. భయాందోళనలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ నగరం పూర్తిగా సురక్షితం. శాంతిభద్రతల పరిరక్షణలో మాకు సహకరించండి. ఏదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేయండి. నిశ్చింతగా ఉండండి. మీ భద్రతే మా బాధ్యతని పేర్కొన్నారు.

# మేడారం జాతరను జాతీయపండుగగా గుర్తించాలి

**కేంద్రానికి మంత్రి పొంగులేటి విజ్ఞప్తి**

**మేడారం, జనవరి 29:** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండోసారి సమ్మక్క-సారక్క జాతర ఇదేనని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భక్తుల సౌకర్యార్థం అనేక శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేడారంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క?సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రుల పర్యటనతో ఈ అంశం త్వరలోనే సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క-సారక్క జాతరను గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, మరో కుంభమేళాగా ఆయన అభివర్ణించారు. ఈ మహాజాతర విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన అధికారులు, సిబ్బంది మరియు సహకరించిన మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో కేవలం 90 రోజుల్లోనే ఆలయ అభివృద్ధి పనులు మరియు మౌలిక వసతులు పూర్తి చేసినట్లు తెలిపారు. సాధారణంగా నాలుగు రోజులపాటు జరిగే జాతరను, ఈసారి భక్తుల రద్దీ దృష్ట్యా విస్తృత ఏర్పాట్లతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జాతర ప్రశాంతంగా, సవ్యంగా కొనసాగుతోందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ఇతర జిల్లాల నుంచి వచ్చి సేవలందించిన సిబ్బంది మరియు సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గద్దెల పునర్నిర్మాణం సహా మౌలిక సదుపాయాల పనులు నిర్ణీత కాలంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం గారికి విజ్ఞప్తి చేసినట్లు, అలాగే జాతర నిర్వహణకు మరింత ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ కేంద్ర మంత్రులకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తులు హాజరవుతున్న ఈ మహాజాతరలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంటూ, జాతర విజయవంతానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు మరియు మీడియా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ రాష్ట్రం

- కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు
- టీవీ సీరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్
- మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు
- మండిపడ్డ బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్


**న్యూఢిల్లీ, జనవరి 29:** తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మెరుగుపరచడానికి కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కుంభకోణాలు, అవినీతి, మంత్రుల మధ్య గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపాలిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 106 మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ, పట్టణాల అభివృద్ధి కోసం పని చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తేనే ప్రోగ్రెస్ జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఒక వర్గాన్ని సంతోషపరచడం కోసమే పని చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ.. ఓ ఫెయిల్యూర్ నాయకుడు అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# ఇప్పటికే 80 లక్షల మంది దర్శనం

**మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్కల వెల్లడి**



**మేడారం, జనవరి 29:** మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ, గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయను న్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. క్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యత ను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప?లక్నవరం?జంపన్న వాగు వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్-లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.జాతర విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం మరియు మీడియా మిత్రులకు సీతక్క అభినందనలు తెలిపారు.నివారం సాయంత్రం 4 గంటలకు తల్లులు గద్దెల నుంచి తిరిగి వనప్రవేశం చేయనున్నారని, అప్పటివరకు భక్తులు ఓపికతో దర్శనాలు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



సంపాదకీయం

# తెలంగాణలో పట్టణ పోరుకు రంగం సిద్ధం!

ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగ. సవాళ్లు, ప్రతి సవాళ్లతో కాలం గడిపేయవచ్చు. అనుయాయులను గెలిపించుకునేందుకు ఆరాటపడం తప్ప మరోటి ఉండదు. మొన్నటికి మొన్న తెలంగాణలో గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సందడి ముగిసింది. ఇప్పుడు మున్సిపల ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ పార్టీల్లో హడావిడి జోరందుకుంది. పార్టీ పరంగానే ఎన్నికలు జరగనున్న కారణంగా అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే మున్సిపాలిటీల్లో పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా మున్సిపల్ పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలయ్యింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మొత్తంగా పంచాయితీ తరవాత ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయ్యింది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. షెడ్యూల్ విడుదలతో పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టణాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో అభ్యర్థులు తలమునకల య్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గ చూపుతారు. పురపోరులో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇదిలా ఉంటే పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ గుర్తింపు ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. పట్టణాలు, వార్డుల్లో మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుం డటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా పట్టణాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.




# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

- ఐరోపాతో ఒప్పందంపై మోడీ
- రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జనవరి 29:** పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ÷ాష్ట్రపతి ప్రసంగం ప్రజల



ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్దిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్- ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ది పొందాలని కోరుతున్నాను. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదని అన్నారు.

# జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి

## పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే

## ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, జనవరి 29:** దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వేను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగుతోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి



పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ ఆ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బ్జడెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# ఖర్గే, రాహుల్‌తో థరూర్ భేటీ




**న్యూఢిల్లీ, జనవరి 29:** కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీలతో సమావేశమయ్యారు. బుధవారం పార్లమెంటులో ఖర్గే కార్యాలయంలో కొన్ని గంటలపాటు ఈ సమావేశం జరిగింది. గతవారం కేరళలో జరిగిన కీలక సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. దీంతో శశిథరూర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారని ఊహాగానాలు వినిపించాయి. ఈ తరుణంలో ఖర్గేతో, రాహుల్‌తో శశిథరూర్ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం థరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ' మా ఇద్దరి నాయకులతో మాట్లాడాను. మా చర్చలు సానుకూలంగా జరిగాయి. మేము కలిసి నడుస్తాము. నేను ఎప్పుడూ పార్టీ కోసం ప్రచారం చేశాను. నేను వ్యక్తిగతంగా ఎక్కడా ప్రచారం చేయలేదు' అని అన్నారు. మీరు ఎన్నికల్లో పోటీ చేస్తారా? సిఎం పదవి గురించి ఈ సమావేశంలో చర్చించారా అని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఈ విషయంపై మేము మాట్లాడుకోలేదు. ప్రస్తుతానికి నేను ఎంపిని. తిరువనంతపురం నుండి నా ఓటర్ల విశ్వాసం నాకు ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను నేను చూసుకోవాలి. అది నా పని' అని ఆయన అన్నారు. ఈరోజు ఖర్గేతో, రాహుల్‌గాంధీతో చర్చలు సజావుగా సాగినందుకు వారికి శశిథరూర్ కృతజ్ఞతలు తెలిపారు.

# అశ్రునయనాల మధ్య అజిత్ అంత్యక్రియలు


## ప్రభుత్వ లాంఛనాలతో వీడ్కోలు

## కేంద్రహోంమంత్రి అమిత్ షా తదితరుల నివాళి

**ముంబై, జనవరి 29:** అశ్రునయనాల మధ్య దివంగత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకముందు.. కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్ఠాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం ఉద్యం విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో చేపట్టారు. గురువారం ఉదయం ప్రారంభమైన అంతిమ యాత్రలో వేల మంది అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర



మంత్రి నితిన్ గడ్కరీ, ఎపి మంత్రి నారా లోకేష్ సహా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.బారామతి విమానాశ్రయం దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ (66) మ- రణించారు. ఈ దుర్ఘటనలో మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పవార్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పుణ్యశ్లోక అహిల్యాదేవి ఆస్పత్రి నుంచి.. కాటేవాడిలోని ఇంటికి తరలించారు. ఉదయం 9 గంటలకు విద్యా ప్రతిష్ఠాన్ క్యాంపస్ నుంచి అంతిమ యాత్ర మొదలైంది. పూలతో అలంకరించిన రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ప్రధాన రోడ్ల గుండా ఈ యాత్ర సాగింది. 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తర్వాత భౌతికదేహాన్ని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌కు చేర్చారు. అక్కడ రాష్ట్ర లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. అజిత్ పవార్ కుమారులు చివరి క్రియలు నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శరద్ పవార్, సుప్రియా సూలే సహా అన్ని పార్టీల నేతలూ పాల్గొన్నారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడి, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మరోవైపు విమాన ప్రమాదంపై డీజీసీఏ, ఏఏఐబీ దర్యాప్తు మొదలైంది. బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన పొగమంచు, విజిబులిటీ తక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ఐతే.. దర్యాప్తు తర్వాత పూర్తి నివేదిక వస్తుంది. అందులో ఏం చెబుతారన్నది తేలాల్సిన అంశం. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించారు. ఆయనది ప్రమాద మరణమా, లేక కుట్ర పూరిత హత్యా అనే సందేహాలు ఉన్నాయి. అయితే ఈ అనుమానాలను శరద్ పవార్ తోసిపుచ్చారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్




- ఎన్నికల నియమవళి పక్కాగా అమలు చేయాలి
- జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్

**నేటి సాక్షి - కోరుట్లలి( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల – మెట్ పల్లి మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ గురువారం పరిశీలించారు.

**సజావుగా జరుగుతోందా.?**

ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉండేల చూసుకోవాలని ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్, మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్, కోరుట్ల ఎమ్మార్వో కృష్ణ చైతన్య , రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ పగడ్బందీగా నిర్వహించాలి

- నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.

**ఎలాంటి పొరపాట్లు జరగొద్దు**

ఈ సందర్భంగా నామినేషన్ స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ ప్రక్రియ లో భాగంగా నోటిస్ బోర్డుపై ప్రదర్శించిన విధానాన్ని పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో ఆర్వో, ఏ ఆర్వో ల విధులను క్షుణ్ణంగా వివరించారు. అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా పై అధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారులు అందరిని సమన్వయం చేసుకుంటూ తమ విధులు జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో ఆర్డీవో



మధుసూదన్, డిపివో మదన్ మోహన్, మున్సిపల్ కమిషనర్ స్పందన, తహసీల్దార్ రాం మోహన్ రావు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మహేందర్ బాబు మొక్కు.. ఎమ్మెల్యే తులాభారం



**రాయికల్ - నేటి సాక్షి ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** రాయికల్ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ మహేందర్ బాబు గురువారం రాయికల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి తన మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నిలువెత్తు బంగార (బెల్లం) తులాభారం సమర్పించారు. రాయికల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహేంద్ర బాబు జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్ 2023లో గెలుపొందాలని వెంకటేశ్వర స్వామి వారిని మొక్కుకోగా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నిలువెత్తు బెల్లం జోకి తులాభారం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ**

రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తానని గౌరవ ముఖ్యమంత్రి 5కోట్ల ఇాణఖీ నిధులు మంజూరు చేయటం జరిగిందని అన్నారు. రాయికల్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని రాయికల్ పట్టణ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. రాయికల్ పట్టణంలో హనుమాన్ ఆలయం,గుడి కోట ఆలయ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. రాయికల్ పట్టణ అభివృద్ధి కి 15 కోట్లు మంజూరు చేయగా ఇటీవల మంత్రితో కలసి 7 కోట్ల 20 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ చేయటం జరిగిందన్నారు. మరొక 7 కోట్ల 80 లక్షలతో అతిత్వరలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తామన్నారు. అన్నివర్గాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు పడిగల రవీందర్ రెడ్డి కోల శ్రీనివాస్ శ్రీనివాస్ గౌడ్ ఆలయ ఛైర్మెన్ గంగాధర్ మహేంద్ర బాబు మోర రామ్మూర్తి రాయికల్ పట్టణ మండల నాయకులు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి బీఎస్పీ నేతల భారీ చేరికలు

- మాజీ మంత్రి రెడ్యానాయక్ సమక్షంలో

**నేటి సాక్షి, మహబూబాబాద్ బి. రవినాయక్:** మరిపెడ మండలంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మరింత బలోపేతమైంది. మాజీ మంత్రి డి.ఎస్. రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు సమక్షంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి చెందిన కీలక నేతలు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఐనాల పరశురాములు నాయకత్వంలో జిల్లా ఇంచార్జ్ అభి నాయక్, మహిళా జిల్లా కో-కన్వీనర్ నవతతో పాటు సుమారు 200 మంది కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి హామీ ఇచ్చారు. ఈ చేరికలతో మరిపెడ మండలంతో పాటు డోర్నకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం పెరిగిందని నాయకులు ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్ రెడ్డి, కుడితి మహేందర్ రెడ్డి, గూగులోత్ వెంకన్న, ఉప్పల నాగేశ్వర్ రావు, అయ్యూబ్ పాషా మరియు ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న జబర్దస్త్ టీం



- ఘనంగా సన్మానించిన సమ్మక్క సారలమ్మ ఆలయ కమిటీ

**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా సినీ జబర్దస్త్ టీం లీడర్ వెంకీ మంకీ కుటుంబ సభ్యులతో వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం అందజేసి ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయంలో జబర్దస్త్ ఖతర్నాక్ కామెడీ షో టీమ్ లీడర్ వెంకీ మంకీతో సందడి ఇటీవల గన్నేరువరం మండలం కేంద్రం లో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఎఫ్3 మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్ లో మేడారం సమ్మక్క సారలమ్మ సాంగ్ తీశారు. సమ్మక్క సారలమ్మ ఆలయంలో సందడి చేశారు. సందర్భంగా జబర్దస్త్ టీం వెంకీ మంకీ సమ్మక్క సారలమ్మను దర్శించుకోవడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనతో ఫోటోలు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

# ఎన్నికల పేరుతో మోసాలకు యత్నం

- ముత్యాలవాడలో గుర్తు తెలియని వ్యక్తుల సంచారం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కోరుట్ల సిఐ సురేష్ బాబు

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని ముత్యాలవాడ ప్రాంతంలో ఎన్నికల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్టు సమాచారం అందింది. బుధవారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు 'ఎన్నికల పనుల కోసం వచ్చాం' అంటూ స్థానికుల వద్ద ఆధార్ కార్డులు, వ్యక్తిగత వివరాలు అడుగుతున్నట్లు తెలిసింది. స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించి వారిని అనుమానంతో ప్రశ్నించడంతో, వారు సమాధానాలు ఇవ్వలేక అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. అనంతరం ఈ విషయం పోలీసులకు తెలియజేయగా, సంబంధిత వివరాలు పోలీసుల దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. అనుమానమొస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండిలి : కోరుట్ల సిఐ ఎన్నికల సమయంలో అధికారులు లేదా సిబ్బంది ఎవరికైనా సమాచారం సేకరించాల్సి ఉంటే సరైన గుర్తింపు కార్డులు, అధికారిక పత్రాలు తప్పనిసరిగా చూపిస్తారని కోరుట్ల సిఐ సురేష్ బాబు పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎన్నికల పేరుతో వచ్చి వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని ఆయన సూచించారు.ఇలాంటి అనుమానాస్పద వ్యక్తులు



ఎవరైనా మీ ప్రాంతంలో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరారు.

# బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ




**నేటి సాక్షి, గన్నేరువరం:** మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన ముద్ర కొల సత్తవ్వ ఇటీవల మృతి చెందగా, వారి నిరుపేద కుటుంబానికి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి సూచన మేరకు గ్రామ శాఖ అధ్యక్షులు రాళ్లపల్లి రవికుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ మల్లేశం గౌడ్, వెగల రవి తదితరులు ఈ బియ్యాన్ని అందజేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# చిన్నారుల మృతిపై ఐక్య వేదిక



**నేటి సాక్షి మహబూబాబాద్:** మరిపెడ మండలం ఇటుకల గడ్డ తండా అంగన్వాడీ కేంద్రంలో చైత్ర, నిత్య శ్రీ అనే ఇద్దరు చిన్నారులు మృతి చెంది 60 రోజులు గడిచినా బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ, ఈ నెల 31న లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటీ తండాలో పర్యటించనుంది. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర సమన్వయకర్త జాదవ్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగుతుందని మండల అధ్యక్షుడు దేవేందర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలపాలని ఆయన కోరారు.

# మురుగుతో ప్రజల అవస్థలు



**నేటి సాక్షి, నారాయణపేట( ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని రైతురు వెళ్లే రహదారిలో గల డ్రైనేజీలో మురుగునీరు నిలిచి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుందని మరికల్ గ్రామ ప్రజలు వాపోతున్నారు . డ్రైనేజీ లో మురుగునీరు మురుగునీరు వెళ్లకుండా కాలువలో చెత్తాచెదారం వెయ్యడంతో రోడ్డుపై దుర్వాసన వెదజల్లుతుందని మరికల్ గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలగించే ఏర్పాట్లు చేయాలని మరకల్ గ్రామ ప్రజలు కోరుతున్నారు

# పుంగనూరు సిఐగా సాయి ప్రసాద్



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** పుంగనూరు రూరల్(చౌడేపల్లి) సర్కిల్ ఇన్స్పెక్టర్ గా సాయి ప్రసాద్ నియమితులయ్యారు .గురువారం ఈ మేరకు ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో తన ఛాంబర్ నందు బాధ్యతలు చేపట్టారు గతంలో ఇక్కడ పనిచేస్తున్న రాంభూపాల్ అనంతపురం వి ఆర్ కు బదిలీ కాగా అదే జిల్లా తాడిపత్రిలో పనిచేస్తున్న సాయి ప్రసాద్ ఇక్కడికి నియమితులయ్యారు న్యాయం కోసం వచ్చే బాధితులకు ప్రాధాన్యత ఇస్తానని చట్టపరంగా వారికి రక్షణ కల్పిస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు .ఫ్రెండ్లీ పోలీసింగ్ ను ప్రోత్సహిస్తానని అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ఎస్సై నాగేశ్వరరావు సోమల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్స్పెక్టర్ సాయి ప్రసాద్ ను సన్మానించారు

# నామినేషన్లను పరిశీలించిన కలెక్టర్



**నేటి సాక్షి నారాయణపేట:** మద్దూరు మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయనే వివరాలను రిటర్నింగ్ అధికారి విజయకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటల నుండి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయని, ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

# భీష్మ ఏకాదశి భక్తితో పూజలు



**నేటి సాక్షి న్యూస్ :** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం స్థానిక రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి .ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు, భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయాన్నే ప్రధానార్చకుడు వశిష్టాచార్యులచే స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకము అలంకరణ నిర్వహించారు .ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేణుగోపాలస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

# ఎన్నికల విధుల్లో బృందాలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

నేటి సాక్షి,

**జగిత్యాల(రాధారపు నర్సయ్య):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల కలెక్టరేట్ ఆడిటోరియంలో ఫ్లయింగ్ స్క్వాడ్ (ఫ్లీూ), స్టాటిక్ సర్వైలెన్స్ (ఎూ), జోనల్ అధికారులు మరియు అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు రూ. 50 వేల లోపు నగదు మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉందని, అంతకు మించి తీసుకెళ్తే తప్పనిసరిగా సరైన ఆధార పత్రాలు చూపాలని స్పష్టం చేశారు. నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడంలో ప్రత్యేక బృందాల పాత్ర కీలకమని, రాజకీయ పార్టీల ప్రలోభాలు, మద్యం, నగదు పంపిణీపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. జోనల్ అధికారులకు మేజిస్ట్రేట్ అధికారాలు ఉంటాయని, తనిఖీల ప్రక్రియను తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. ఎఫ్ఎస్‌టి బృందాలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షిస్తామని, ఎంసీసీ ఉల్లంఘనలపై రోజువారీ నివేదికలు అందించాలని కలెక్టర్ తెలిపారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే కలెక్టరేట్‌లోని 24/7 కంట్రోల్



రూమ్ నంబర్ 9666234383ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజ గౌడ్, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ శ్రీనివాస్ మరియు జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మాసోత్సవంలో రక్తదాన శిబిరం సీపీఆర్ అవగాహన



**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** ఆర్టీఏ యూనిట్ ఆఫీస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కోరుట్ల పట్టణంలోని ఆర్టీఏ యూనిట్ ఆఫీస్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ప్రథమ చికిత్స, సీపీఆర్ (CPR)పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

### మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని అనేక కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని తెలిపారు. యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనదారుల జాగ్రత్తే ప్రమాదాలను తగ్గించే మార్గమని పేర్కొన్నారు.

### రక్తదాన శిబిరం ఏర్పాటు

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన బాధితులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

- డ్రైవర్లకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం
- మద్యం సేవించి వాహనాలు నడపవద్దు ఆర్టీఏ అధికారులు

### డ్రైవింగ్ స్కూల్, షోరూమ్ అసోసియేషన్ల సహకారం

ఈ కార్యక్రమాన్ని కోరుట్ల–మెట్‌పల్లి మోటార్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్, షోరూమ్స్ అసోసియేషన్‌ల సహకారంతో నిర్వహించారు. డ్రైవర్లలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డీటీఓ ఎం. శ్రీనివాస్, ఎంవీఐ ప్రమీల, ఏఎంవీఐ రియాజుద్దీన్‌తో పాటు సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

# లారీ డ్రైవర్‌కు10 నెలల జైలుశిక్ష

- కోరుట్ల కోర్టు సంచలన తీర్పు

**నేటి సాక్షి కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి (జీవీఖీజ) ఎన్. అరుణ్ కుమార్ 10 నెలల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. ఏడేళ్ల క్రితం జరిగిన ఈ ప్రమాదంపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ నిర్ణయం వెలువరించింది. కసు వివరాలు: 2017 డిసెంబర్ 4న కోరుట్ల మండలం తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన మోత్కూరి నర్సగౌడ్ తన ద్విచక్ర వాహనంపై కోరుట్ల నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వడ్ల లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ గండ్ల లక్ష్మణ్ (నిజామాబాద్) అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక ఉన్న నర్సగౌడ్ ద్విచక్ర వాహనం లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సగౌడ్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. నేరం రుజువు కావడంతో శిక్ష: ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో, న్యాయమూర్తి నిందితుడికి 10 నెలల జైలు శిక్ష ఖరారు చేశారు. రోడ్డు భద్రత పట్ల అజాగ్రత్తగా ఉంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ తీర్పు ద్వారా కోర్టు హెచ్చరించింది.

# 'రామ్' పేరున్నందుకే పథకాన్ని వ్యతిరేకిస్తున్నారు



**నేటి సాక్షి గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో ప్రవేశపెట్టిన 'వికసిత భారత్ గ్యారెంటీ (VBG) రామ్ జీ-2025' చట్టాన్ని కేవలం అందులో 'రామ్' అనే పేరున్నందుకే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఏ మంచి పని చేసినా అడ్డుపడటమే కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని మండిపడ్డారు. కూలీల సంక్షేమమే కేంద్రం ధ్యేయం: ఉపాధి హామీ బడ్జెట్‌ను రూ. 86 వేల కోట్ల నుంచి రూ. 1.50 లక్షల కోట్లకు పెంచడమే కాకుండా, కూలీలకు ఏటా 125 రోజుల పని గ్యారెంటీ కల్పించిన ఘనత ప్రధాని మోదీదేనని నికేష్ పేర్కొన్నారు. పనిచేసిన 15 రోజుల్లోపే వేతనాలు నేరుగా ఖాతాల్లో జమ అవుతాయని, డిజిటల్ హాజరు ద్వారా అవినీతికి తావులేకుండా అర్హులైన కూలీలకు న్యాయం జరుగుతుందని వివరించారు. తెలంగాణకు అదనంగా రూ. 346 కోట్ల నిధులు కేటాయించి కేంద్రం అండగా నిలిచిందని గుర్తుచేశారు. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: గత కాంగ్రెస్ హయాంలో ఉపాధి హామీకి కేటాయించిన నిధుల కంటే బీజేపీ ప్రభుత్వం ఎన్నో రెట్లు అధికంగా కేటాయించిందని గణాంకాలతో వివరించారు. కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాలను బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి తిరుపతి, పుల్లెల రామ్, మునుగంటి సత్తయ్య, కాంతల రాజిరెడ్డి, మాడుగుల రామకృష్ణారెడ్డి, గూడూరి జగన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్

# కాలువలు ధ్వంసం చేస్తే కేసులు తప్పవు



**నేటి సాక్షి: మెట్‌పల్లి:** ఎస్సారెస్పీ ఉపకాలువలను ధ్వంసం చేసినా లేదా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి డివిజన్ నీటిపారుదల శాఖ ఈఈ వేంపటి సురేష్ హెచ్చరించారు. గురువారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బర్దిపూర్ గ్రామ శివారులోని కాకతీయ ఉపకాలువ డిస్ట్రిబ్యూటర్ (డి-24)ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో కాలువలను కబ్జా చేయడం వల్ల చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు వ్యవసాయానికి ప్రాణాధారమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాలువ స్థలాల్లో స్వాగత తోరణాలు లేదా ఇతర శాశ్వత నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని, దీనివల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి కాలువ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాలువల పరిరక్షణ కోసం అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ మురళీ కృష్ణ, ఏఈఈలు చేతన్, సాజీత్, ఏఈ కవిత మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

- ఈఈ వేంపటి సురేష్

# మాజీ సీఎంకు సిట్ నోటీసులు తగదు

- పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య

**నేటిసాక్షి : జగదేవపూర్ :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కక్షపూరిత కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ కామల్ల భూమయ్య, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు కర్ణాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన జగదేవపూర్ లో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ జాతిపిత కేసీఆర్ ను జోలికి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే రేవంత్ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలం పాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అన్నారు. అలాంటి చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం సూర్యునిపై ఉమ్మి వేయడమేనాని తెలిపారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్ రెడ్డి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం అన్నారు. చరిత్రను సృష్టించినవాడు కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని అధికారం శాశ్వతం కాదాని అహంకారం అంతకంటే కాదన్నారు. తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉందని ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.



# కేసీఆర్ జోలికొస్తే సహించేది లేదు

### రేవంత్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నాయకుల ధ్వజం



**నేటి సాక్షి జగదేవపూర్ :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న కక్షపూరిత రాజకీయాలను బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం జగదేవపూర్ మండల కేంద్రంలో కొండపోచమ్మ దేవాలయం మాజీ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, బిఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కవిత శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, పదేళ్లపాటు తెలంగాణను అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్‌పై బురద చల్లాలని చూడటం సూర్యుడిపై ఉమ్మివేయడమేనని మండిపడ్డారు. కేసీఆర్ జోలికొస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లేనని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే ప్రభుత్వం ఇలాంటి కుతంత్రాలకు పాల్పడుతోందని, ఇది రేవంత్ రెడ్డి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారంతో వ్యవహరిస్తున్న పాలకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వారు స్పష్టం చేశారు. తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉందని, ఇలాంటి వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏల్వోసీ అందించిన ఎమ్మెల్యే




**నేటి సాక్షి - మెట్‌పల్లి(దామ రాజేష్):** మెట్‌పల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెట్ పల్లి పట్టణానికి చెందిన అబ్దుల్ జావిద్ కు మంజూరైన 1,50,000/- ఒక లక్ష యాభై వేల రూపాయల విలువగల ఎల్వోసీని బాధితుడికి అందించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

# తహశీల్దార్ శ్రీనివాస్‌కి సన్మానం



**నేటి సాక్షి - మెట్‌పల్లి :** మల్లాపూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ శ్రీనివాస్ ని గురువారం సీనియర్ నాయకులు ఎల్కా కమలాకర్ దప్పుల నర్సయ్య మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల సహకారం తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాకు అన్యాయం చేసింది



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్ 9 కాంగ్రెస్ యువ నాయకుడు యూసుఫ్ పార్టీపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అన్యాయం జరిగిందని, గెలిచే సీటును కోల్పోయానని ఆయన వాపోయారు. కాంగ్రెస్ పార్టీ కోసం గత 15 సంవత్సరాలుగా నిబద్ధతతో పనిచేశానని, పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలు, ఎన్నికల్లో ఎల్లప్పుడూ ముందుండి పోరాడానని యూసుఫ్ తెలిపారు. స్థానికంగా ప్రజల్లో తనకు మంచి గుర్తింపు ఉండగా, ఈసారి టికెట్ తనకే వస్తుందని ఆశించానని చెప్పారు. అయితే పార్టీ నాయకత్వం తనను పక్కన పెట్టి వేరే వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ కేటాయించడం తీవ్ర నిరాశకు గురి చేసిందని అన్నారు తాను ఎన్నో కష్టనష్టాలు ఓర్చి పార్టీని బలోపేతం చేయడానికి పనిచేశానని, కానీ చివరి సమయంలో తనను కాదని వేరే వారికి అవకాశం ఇవ్వడం వల్ల మనసుకు చాలా బాధ కలిగిందని యూసుఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయం వల్ల తనతో పాటు తనను నమ్మిన కార్యకర్తల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. పార్టీ పెద్దలు ఈ విషయాన్ని పునఃసమీక్షించి న్యాయం చేయాలని,లేకపోతే నేను ఇక్కడి తో అగను ఇండిపెండెంట్ గా బరిలో నిలిచి ప్రజల ఆశీర్వాదం పొందుతానని నాకు నమ్మకం ఉంది అని తెలిపారు,

# సారు జర పెన్షన్ ఇప్పించండి



**నేటి సాక్షి - మెట్‌పల్లి :** మెట్ పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన పందిరి రాజు వయసు 22 ఇతనికి మతిస్థిమితం సరిగా లేక ఊరిలో అక్కడక్కడ తిరుగుతూ అందరినీ 5 10 రూపాయలు అడుగుతూ జీవనం సాగిస్తున్నాడు ఇతని కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా చాలా దయనీయ పరిస్థితిలో ఉంది కావున సంబంధిత అధికారులు పందిరి రాజుకు పెన్షన్ ఇప్పించాలని వేంపేట గ్రామస్తులు కోరుతున్నారు

# బంగ్లాదేశ్ 'యూటర్న్'

## షూటింగ్ టీమ్‌కు భారత్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్!

**క్రికెట్ టీమ్ వద్దు.. షూటర్లు ముద్దు: బంగ్లా ప్రభుత్వం ద్వంద్వ నీతి**

**టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకొని.. ఇప్పుడు ఢిల్లీకి షూటింగ్ జట్టు**

**పాక్ మాటలు నమ్మి భద్రత సాకుతో వెనక్కి.. ఇప్పుడు భద్రత ఉందట!**




**న్యూఢిల్లీ, జనవరి 29:** 'ఆకు వచ్చి ముల్లు మీద పడ్డా.. ముల్లు వచ్చి ఆకు మీద పడ్డా చిరిగేది ఆకే' అన్న సామెత ప్రస్తుతం బంగ్లాదేశ్ ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. భారత్‌లో భద్రతా కారణాలు చూపుతూ క్రికెట్ టీ20 ప్రపంచకప్ నుంచే తప్పుకున్న బంగ్లాదేశ్, ఇప్పుడు అనూహ్యంగా తన షూటింగ్ జట్టును భారత్‌కు పంపేందుకు అనుమతినిచ్చింది. ఫిబ్రవరి 2 నుంచి న్యూఢిల్లీలో ప్రారంభం కానున్న ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇద్దరు సభ్యులతో కూడిన బంగ్లా బృందానికి ఆ దేశ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### క్రికెట్‌కు ఒక నీతి.. షూటింగ్‌కు ఒక నీతా?

ఫిబ్రవరిలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న విన్నపాన్ని ఐసీసీ తోసిపుచ్చడంతో, భద్రత లేదంటూ బంగ్లా అలిగింది. అయితే, షూటర్ల విషయంలో మాత్రం బంగ్లా స్పోర్ట్స్ సెక్రటరీ మెహబూబ్ ఉల్ ఆలం వింత వాదన వినిపించారు. షూటింగ్ ఇండోర్ గేమ్ అని, ప్రేక్షకులు తక్కువగా ఉంటారు కాబట్టి భద్రతకు ముప్పు లేదని వ్యాఖ్యానించారు. దీనిపై క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. పాకిస్థాన్ మాటలు విని భారత్‌తో కయ్యానికి దిగిన బంగ్లాకు, అంతర్జాతీయ పోటీల ప్రాముఖ్యత గుర్తొచ్చి ఇప్పుడు మెత్తబడినట్లు కనిపిస్తోంది.

### భారత్ నుంచి పూర్తి భద్రత..

బంగ్లా షూటింగ్ బృందం జనవరి 31న ఢిల్లీకి చేరుకుంటుందని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ పవన్ సింగ్ ధృవీకరించారు. భారత విదేశీ మరియు క్రీడల మంత్రిత్వ శాఖల నుంచి ఇప్పటికే అనుమతులు లభించాయని తెలిపారు. క్రికెట్ విషయంలో ముస్తాఫిజుర్ రెహమాన్ ఐపీఎల్ విడుదల అంశాన్ని సాకుగా చూపి రాద్ధాంతం చేసిన బంగ్లా, ఇప్పుడు షూటర్లను పంపడం ద్వారా తన వైఖరిలోని లోపాలను బయటపెట్టుకుంది.



# సబలెంకా వర్సెస్ స్విటోలినా!

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 'పొలిటికల్' సెగ..

**నో షేక్ హ్యాండ్.. నో ఫోటో.. కోర్టులో భారత్-పాక్ తరహా ఉద్రిక్తత**

**అంపైర్‌తో సబలెంకా వాగ్వాదం.. 'హిండ్రెన్స్' కాల్‌తో పాయింట్ కట్**

**వరుసగా 4వ సారి ఫైనల్‌కు సబలెంకా.. మార్టినా హింగిస్ రికార్డు సమం!**

**మెల్బోర్న్, జనవరి 29:** ఆస్ట్రేలియన్ ఓపెన్ వేదికగా గురువారం జరిగిన మహిళల సెంగిల్స్ సెమీఫైనల్ పోరు క్రీడా స్ఫూర్తి కంటే రాజకీయ ఉద్రిక్తతలకే వేదికైంది. వరల్డ్ నంబర్-1, బెలారస్ స్టార్ అరీనా సబలెంకా, ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలినా స్విటోలినా మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో కనీసం 'హ్యాండ్‌షేక్' కూడా ఇచ్చుకోకపోవడం క్రీడా ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ ప్లేయర్లతో చేతులు కలపకూడదనే ఉక్రెయిన్ క్రీడాకారుల నిర్ణయాన్ని స్విటోలినా ఇక్కడ కూడా కొనసాగించారు.

### కోర్టులో 'హిండ్రెన్స్' వివాదం

మ్యాచ్ ఆరంభానికి ముందు ఫోటోలకు కూడా ఇద్దరూ కలిసి నిలబడలేదు. ఇక మ్యాచ్ జరుగుతున్న సమయంలో సబలెంకా చేసిన వింత శబ్దాలపై అంపైర్ లూయిస్ అజెమర్ ఎంగ్జెల్ 'హిండ్రెన్స్' (ఆటకు ఆటంకం) కింద పాయింట్ కట్ చేయడం తీవ్ర దుమారం రేపింది. ఈ నిర్ణయంపై సబలెంకా అంపైర్‌తో తీవ్రంగా వాదించి, వీడియో రివ్యూ కోరారు. అయితే అంపైర్ తన నిర్ణయానికే కట్టుబడటంతో మైదానంలో వాతావరణం మరింత వేడెక్కింది.

### సబలెంకా సరికొత్త చరిత్ర:

రాజకీయ ఉద్రిక్తతలు, వివాదాల మధ్య సాగిన ఈ పోరులో సబలెంకా తన విశ్వరూపం చూపింది. కేవలం 1 గంట 16 నిమిషాల్లోనే స్విటోలినాను 6-2, 6-3 తేడాతో మట్టికరిపించింది. ఓపెన్ ఎరాలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగు సార్లు ఫైనల్‌కు చేరిన మూడో క్రీడాకారిణిగా (గతంలో ఎవోన్ గూలాగాంగ్, మార్టినా హింగిస్ మాత్రమే ఈ ఘనత సాధించారు) నిలిచింది. శనివారం జరగనున్న ఫైనల్లో ఆమె కజకిస్థాన్ స్టార్ ఎలెనా రైబాకినాతో తలపడనుంది.

# భారీ లక్ష్యాల ఛేదనలో బయటపడ్డ భారత్ బలహీనత

## ప్రపంచకప్ ముంగిట టీమిండియాను కలవరపెడుతున్న గణాంకాలు



**విశాఖపట్నం, జనవరి 29:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీబీ సిరీస్‌లో భారత్ తొలి ఓటమిని చవిచూసింది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో వరుసగా మూడు విజయాలతో జోరుమీదున్న భారత్, క్లీన్‌స్వీప్ దిశగా సాగుతుందని అభిమానులు ఆశించారు. కానీ బుధవారం విశాఖపట్నంలో జరిగిన నాలుగో మ్యాచ్‌లో కివీస్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 216 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, 18.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ ఓటమితో టీమిండియాను ఒక పాత బలహీనత మళ్లీ వేధిస్తోంది.

### 210 పరుగుల గండం

టీబీ ఫార్మాట్‌లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నా, 210 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చినప్పుడు మాత్రం తడబడుతోంది. గణాంకాలను పరిశీలిస్తే, టీబీ చరిత్రలో భారత్ ఇప్పటివరకు 118 సార్లు ఛేజింగ్ చేయగా, 80 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అయితే ఈ 80 విజయాల్లో ఒక్కటి కూడా 210 కంటే ఎక్కువ లక్ష్యాన్ని ఛేదించినది లేదు. స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ, భారీ స్కోర్లను వేటాడే క్రమంలో ఒత్తిడికి లోనవ్వడం ప్రపంచకప్ ముంగిట ఆందోళన కలిగిస్తోంది.

### వరుస సిరీస్ విజయాల జోరుకు బ్రేక్

ఇప్పటికే వరుసగా 11 టీబీ సిరీస్‌లను గెలుచుకున్న భారత్, ఈ మ్యాచ్‌లోనూ గెలిచి తన ఆధిపత్యాన్ని చాటాలని భావించింది. సిరీస్‌లోని మూడో మ్యాచ్‌లో 154 పరుగుల లక్ష్యాన్ని కేవలం 10 ఓవర్లలోనే పూర్తి చేసి రికార్డు సృష్టించిన జట్టు, 216 పరుగుల భారీ లక్ష్యం ముందు మాత్రం చేతులెత్తేసింది. త్వరత్వరగా వికెట్లు పడటం, పెరిగిన రన్ రేట్ ఒత్తిడిని అధిగమించలేకపోవడమే ఓటమికి ప్రధాన కారణమైంది.

### ప్రపంచకప్ సవాల్

మరో 9 రోజుల్లో టీబీ ప్రపంచకప్ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. నాకౌట్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్టు 200 పైచిలుకు స్కోరు సాధిస్తే భారత్ ఒత్తిడికి లోనవుతుందనే సంకేతాన్ని ఈ ఓటమి ఇచ్చింది. ఇప్పటికైనా భారీ ఛేదనల్లో ఆత్మవిశ్వాసంతో ఆడేలా జట్టులో మార్పులు రావాలని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నాకౌట్ పోరులో పట్టు వీడకుండా పోరాడకపోతే టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఆర్సీబీ మాస్ బ్యాటింగ్.. ఫైనల్ బెర్త్ ఖరారు!

- **వారియర్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం**
- **కెప్టెన్ స్మృతి మంధాన, గ్రేస్ హారిస్ మెరుపు హాఫ్ సెంచరీలు**
- **వడోదర వేదికగా ఆధిపత్యం చాటిన బెంగళూరు బౌలర్లు**
- **సీజన్ ముగియకముందే ఫైనల్లోకి అడుగుపెట్టిన తొలి జట్టుగా ఆర్సీబీ రికార్డు**

**వడోదర, జనవరి 29:** మహిళల ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తన జైత్రయాత్రను కొనసాగిస్తూ ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. గురువారం వడోదరలోని బీసీఏ మైదానంలో యూపీ వారియర్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో లీగ్ దశలో అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్న బెంగళూరు జట్టు, నేరుగా ఫైనల్ చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది.

### తడబడ్డ వారియర్స్..

అదరగొట్టిన బౌలర్లు: టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. ఓపెనర్ మెగ్ లానింగ్ (41) మరియు దీప్తి శర్మ (55) పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్లు ఎవరూ రాణించలేకపోయారు. ఆర్సీబీ బౌలర్లలో నదీన్ డీ క్లెర్క్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 4 వికెట్లు తీసి వారియర్స్‌ను దెబ్బతీసింది. లారెన్ బెల్, ఆశా శోభన చెరో వికెట్ సాధించి కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. 144 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు స్మృతి మంధాన మరియు గ్రేస్ హారిస్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. గ్రేస్ హారిస్ కేవలం 36 బంతుల్లోనే 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 75 పరుగులు చేసి స్టేడియాన్ని హోరెత్తించింది. మరోవైపు కెప్టెన్ స్మృతి మంధాన 27 బంతుల్లోనే 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 54 పరుగులు చేసి



అజేయంగా నిలిచింది. వీరిద్దరి వీరవిహారంతో ఆర్సీబీ కేవలం 13.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.

### ఫైనల్ దిశగా ఆర్సీబీ

ఈ సీజన్‌లో ఆర్సీబీ ఆడిన అన్ని విభాగాల్లోనూ పూర్తి ఆధిపత్యాన్ని కనబరుస్తోంది. ముఖ్యంగా పవర్ ప్లే ఓవర్లలోనే మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకోవడంలో ఈ జట్టు సక్సెస్ అవుతోంది. గ్రేస్ హారిస్ దూకుడు మరియు స్మృతి మంధాన క్లాస్ ఇన్నింగ్స్‌లు ఆర్సీబీకి కొండంత బలాన్ని ఇస్తున్నాయి. నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించడంతో ఆర్సీబీ అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. ఈ నెల 31న గుజరాత్ జెయింట్స్ మరియు ముంబై ఇండియన్స్ మధ్య జరిగే మ్యాచ్ ఫలితం తర్వాత ఎలిమినేటర్ పోరులో ఎవరు తలపడతారో తేలనుంది.

# మహేష్ బాబు నా ఫేవరేట్ తెలుగు హీరో


**విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ**

**సూపర్ స్టార్ నటనకు ఫిదా అయిన టీమిండియా ఆటగాడు**

**హైదరాబాద్, జనవరి 29:** టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తనకు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు అంటే చాలా ఇష్టమని వెల్లడించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఖాళీ సమయంలో మహేష్ బాబు సినిమాలు చూస్తానని, హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆయన క్రేజ్ గురించి తన సహచర తెలుగు ఆటగాళ్లను అడిగి తెలుసుకుంటానని చెప్పారు.

అలాగే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' సినిమా తనకు పిచ్చెక్కించిందని, ఆ చిత్రంలోని మేనరిజమ్స్ తనను బాగా ఆకట్టుకున్నాయని తెలిపారు. తన సహచర ఆటగాళ్లు నితీష్ రెడ్డి, తిలక్ వర్మల సాయంతో తెలుగు డైలాగులు నేర్చుకుంటున్నట్లు, హైదరాబాద్ బిర్యానీ అంటే తనకు ఎంతో ఇష్టమని అభిషేక్ శర్మ పేర్కొన్నారు.







## ఎన్టీఆర్ పేరు వాడితే జైలుకే..

నటుడు జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ కల్పించింది. అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, గుర్తింపు, ఇమేజ్ ను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎన్టీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ను పరిశీలించిన కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఎన్టీఆర్ పేరు, "ఎన్ టీఆర్", "జూనియర్ ఎన్ టీఆర్", "తారక్" వంటి పేర్లు, "యంగ్ టైగ ర్", "మ్యాన్ ఆఫ్ మాసెస్" వంటి బిరుదులు, ఆయన ఫొటోలు, ఇమేజ్ ను అనుమతి లేకుండా వాణి జ్యంగా వినియోగించడం చట్ట విరుద్ధం. ఎక్కడైనా ఇలా అనధికార వినియోగం జరిగితే వెంటనే తొలగించాలని కోర్టు స్పష్టం చేసింది.

### పూర్తి హక్కులు ఎన్టీఆర్‌కే

నందమూరి తారక రామారావు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న సెలబ్రిటీ అని కోర్టు పేర్కొంది. ఆయన పేరు, రూపం ప్రజలకు ప్రత్యేక గుర్తింపుగా మారాయని, అందువల్ల వాటిపై హక్కులు ఆయనకే చెందుతాయని అభిప్రాయపడింది. వ్యక్తి పేరు, ఇమేజ్ వంటి వ్యక్తిత్వ హక్కులు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛతో అనుసంధానమై ఉంటాయని, ఇవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 కింద రక్షణ పొందుతాయని వివరించింది. కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్‌మార్క్ చట్టం 1999 కింద కూడా ఈ హక్కులను అమలు చేయవచ్చని తెలిపింది. ఇంటర్మీడియరీ ప్లాట్‌ఫామ్‌లైన ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకు కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2021 ఐటీ రూల్స్ కింద ఈ పిటిషన్‌ను అధికారిక ఫిర్యాదుగా పరిగణించి, హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన లింక్‌లను చట్టపరంగా నిర్ణయించిన గడువుల్లో తొలగించాలని సూచించింది.

### AI కంటెంట్‌పైనా ఆంక్షలు

ఎన్టీఆర్ పేరు, ఫొటో, ఇమేజ్, గుర్తింపును మెర్చం డైజ్, డిజిటల్ కంటెంట్, మార్ఫ్ చేసిన చిత్రాలు, AI కంటెంట్ లేదా ఏదైనా టెక్నాలజీ ద్వారా వాణిజ్య ప్రయోజనాల కోసం వాడకూడదని కోర్టు స్పష్టం చేసింది. డిజిటల్ యుగంలో పబ్లిక్ పర్సనాలిటీల గుర్తింపు రక్షణ అ త్యంత కీలకమని పేర్కొన్న కోర్టు, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

# దసరా రేస్‌లో 'పెద్ది'–'ఫౌజీ'

### టాలీవుడ్‌కు హై ఓల్టేజ్ పోటీ




గత ఏడాది దసరా సీజన్ టాలీవుడ్‌కు భారీ వసూళ్లు అందించింది. ప వన్ క ళ్యాణ్ 'ఓజీ', 'కాంతారా 2' చిత్రాలు వారం రోజుల వ్యవధిలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించాయి. అదే తరహాలో ఈ దసరా సీజన్ కూడా ఆసక్తికరమైన పోటీకి వేదిక కాబోతోందన్న చర్చ మొదలైంది. ప్రభాస్ ప్రస్తుతం ఫిబ్రవరి 2 నుంచి 'కల్కి 2' షూటింగ్‌లో పాల్గొననున్నాడు. పది రోజుల షెడ్యూల్ అనంతరం తన పూర్తి సమయాన్ని 'ఫౌజీ' చిత్రానికి కేటాయించనున్నట్లు సమాచారం. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే 50 శాతం కంటే ఎక్కువ షూటింగ్ పూర్తి చేసుకుంది. మిగతా భాగాన్ని త్వరితగతిన పూర్తిచేసి, ద సరా కానుకగా విడుదల చేయాలని మేకర్స్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ తన మరో ప్రాజెక్ట్ స్పిరిట్' షూటింగ్‌కు తాత్కాలిక విరామం ఇచ్చినట్టు సమాచారం. అన్నీ అనుకున్నట్టుగా సాగితే 'ఫౌజీ' ఈ దసరాకు థియేటర్లలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' కూడా దసరా బరిలో నిలిచినట్టు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. తొలుత మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలనుకున్న ఈ చిత్ర షూటింగ్ ఇంకా రెండు నెలలు పెండింగ్ ఉండటంతో ఆ ప్లాన్ వాయిదా పడింది. మే 1 విడుదల ఆలోచన కూడా వి రమించుకుని, దసరా సీజన్‌ను లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమాకు పోస్ట్ ప్రొడక్షన్‌పై ఎక్కువ సమయం కేటాయించాలనుకుంటుండటంతో, ప్రశాంతంగా దసరా సెలవుల్లో విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఒకవైపు రామ్ చరణ్ 'పెద్ది', మరోవైపు ప్రభాస్ 'ఫౌజీ'... ఈ రెండు భారీ చిత్రాలు ఒకే సీజన్‌లో విడుదలైతే టాలీవుడ్‌కు మరోసారి పెద్ద టర్నోవర్ ఖాయమనే అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'పెద్ది'పై హైప్ ఎక్కువగా కనిపిస్తోంది. 'ఫౌజీ' నుంచి ఇప్పటివరకు ప్ర మోషనల్ కంటెంట్ తక్కువగానే వచ్చినప్పటికీ, విడుదల సమయం దగ్గరపడేకొద్దీ అంచనాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే కమర్షియల్ అంశాలు ఎక్కువగా ఉన్న చిత్రంగా 'పెద్ది' దసరా రేస్‌లో పైచేయి సాధించే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# వెంకీ–త్రివిక్రమ్ వీడియో వైరల్



వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' షూటింగ్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్ జెబిఎస్ ప్రసాద్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ వద్ద జరిగిన చిత్రీకరణలో వెంకటేష్ స్టైలిష్ లుక్ ఆకట్టుకుంటోంది. మేలోపు షూటింగ్ పూర్తి చేసి, సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి.

# రిలీజ్ డేట్ తో షాకిచ్చిన రాజమౌళి




RRR వంటి గ్లోబల్ హిట్ త ర్వాత రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రం 'వారణాసి'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సినిమాలో సూపర్ స్టార్ మహేష్ బాబును ఇప్పటివరకు క నిపించని స్థాయిలో చూపించాలనే లక్ష్యంతో రాజమౌళి పని చేస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో మహేష్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో ఆయన శ్రీరాముడి రూపంలోనూ కనిపించనున్నట్లు సమాచారం. ఆ సన్నివేశాల షూటింగ్ గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌కు ముందే పూర్తయ్యిందని రాజమౌళి స్వయంగా వెల్లడించాడు. తన మొబైల్ వాల్‌పేపర్‌గా కూడా మహేష్ శ్రీరాముడి లుక్ ఉన్న ఫొటోనే పెట్టుకున్నట్టు చెప్పాడు. 'వారణాసి' రాజమౌళి కెరీర్‌లోనే అత్యంత వేగంగా పూర్తయ్యే చిత్రంగా నిలవనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోపు టాకీ పార్ట్ మొత్తం పూర్తి చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మహేష్ బాబు భాగానికి సంబంధించిన షూటింగ్ సెప్టెంబర్‌కే ముగిసే అవకాశాలు ఉన్నాయి. వీఎఫ్ఎక్స్ పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. అన్ని అనుకున్నట్టే జరిగితే 2027 ఏప్రిల్ 7న సినిమాను విడుదల చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ తేదీని అధికారిక ప్రకటన లేకుండానే రాజమౌళి వినూతనంగా సూచించాడు. వారణాసి ప్రాంతంలో ఏర్పాటు చేసిన రెండు బ్యానర్లలో ఒకదానిపై 'In Theatres', మరొకదానిపై '7 April 2027' అని మాత్రమే ఉండటం చర్చనీయాంశమైంది. ఇంత నిశ్శబ్దంగా విడుదల తేదీని ప్రకటించడం రాజమౌళికే సాధ్యమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్చి 5న ప్రభాస్ నటించిన 'స్పిరిట్' విడుదల కానుంది. ఆ సినిమాపైనా భారీ అంచనాలు ఉన్నాయి. ఒక నెల గ్యాప్‌లో రెండు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియన్ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రావడం అ రుదైన పరిణామంగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బాలీవుడ్ కు బోయపాటి..

### దురంధర్ హీరోతో కథా చర్చలు



టాలీవుడ్ మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను తదుపరి ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తికర ప్రచారం సాగుతోంది. 'అఖండ', 'అఖండ 2 (తాండవం)' చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద తన మార్క్ చూపించిన బోయపాటి, ఇప్పుడు బాలీవుడ్ వైపు అడుగులు వేయనున్నాడన్న చర్చ మొదలైంది. తాజాగా బోయపాటి శ్రీను ముంబై వెళ్లి బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్‌ను కలిసినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఒక భారీ యాక్షన్ కథను ఆయన వినిపించారని, దానికి రణవీర్ సింగ్ సానుకూలంగా స్పందించినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ప్రశాంత్ వర్మతో రణవీర్ సినిమా పట్టాలెక్కకపోయిన నేపథ్యంలో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరిగినట్టు తెలుస్తోంది. బోయపాటి చెప్పిన హై–వోల్టేజ్ మాస్ సబ్జెక్ట్ రణవీర్‌కు నచ్చిందని, చర్చలు ప్రాథమి దశలో కొనసాగుతున్నాయని సమాచారం. ఈ సినిమా ఓకే అయితే బోయపా కెరీర్‌లోనే అతిపెద్ద అ వకాశంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది రణవీర్ సింగ్ స్థాయి స్టార్‌తో సినిమా అంటే అది కేవలం బాలీ వుడ్‌కే పరిమిత కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ప్రభావం చూపుతుందన్న అంచనాలు ఉన్నాయి బోయపాటి మార్క్ యాక్షన్, రణవీర్ ఎనర్జీ క లిస్తే వెండి తెరపై మాస్ సంద ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రాజెక్ట్ ఖరారైతే మైత్రీ మూవీ మేకర్స్ లేద మరో ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉందని సమాచారం.

# ప్రియాంక సంప్రదాయ అందాలు



మరాఠీ సినిమా, టెలివిజన్ రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి ప్రియాంక ఖోల్గాడే మరోసారి వార్తల్లో నిలిచారు. నటనతో పాటు స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, తాజాగా సంప్రదాయ వస్త్రధారణలో కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. ఎథ్నిక్ అవుట్‌ఫిట్‌లో ప్రియాంక ఖోల్గాడే చూపించిన అందం, లావణ్యం నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. చీరలైనా, ఇతర సంప్రదాయ దుస్తులైనా సహజమైన హావభావాలతో, క్లాసీ స్టైల్‌తో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. సినిమాలు, టీవీ షోలు, మ్యూజిక్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ప్రియాంక, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కూడా దూసుకుపోతున్నారు. తాజాగా విడుదలైన ఆమె ఎథ్నిక్ ఫోటోలు ప్రస్తుతం వైరల్‌గా మారగా, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నటనతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర వేస్తూ, ప్రియాంక ఖోల్గాడే భవిష్యత్తులో మరిన్ని అవకాశాలతో ముందుకు సాగుతారని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# అల్లు అర్జున్–లోకేశ్ మూవీలో బాలీవుడ్ బ్యూటీ

ఐకాన్‌స్టా ర్అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి అధికారిక అనౌన్స్‌మెంట్ వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఒక పుస్తకం ఆధారంగా రూపొందుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ కథ బాక్సాఫీస్‌పై భారీ ప్రభావం చూపుతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో అల్లు అర్జున్ సూపర్ నేచురల్ శక్తులు ఉన్న సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నట్టు సమాచారం. ఇక హీరోయిన్‌గా బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ఎంపికైందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రద్ధా 'ఈట' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. ఇప్పటికే ప్రభాస్ 'సాహో'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమెకు, ఈ ప్రాజెక్ట్ మరింత గుర్తింపు తీసుకురావొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

## జనసేన తరపున ఈర్ల సునీల్



**నేటి సాక్షి కాగజ్‌నగర్:** ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని 25వ వార్డులో జనసేన పార్టీ తరపున ఈర్ల సునీల్ మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనసేన హాడ్ హాక్ మెంబర్లు మంతని సంపత్, మాయ రమేష్ ఆదేశాల మేరకు, అల్లూరి సాయి కుమార్ ఆధ్వర్యంలో నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా ఈర్ల సునీల్ మాట్లాడుతూ, పార్టీ ఆదేశాల మేరకు వార్డు అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని తెలిపారు.

## పాడైన కల్వర్టును నిర్మించండి

**గామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ**



**నేటి సాక్షి పాములపాడు:** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామం నుండి వెలు గోడుకు పోయే రహదారిలో పడిపోయిన కల్వర్టును రోడ్డు భవనాల శాఖ వారు వెంటనే నిర్మించాలని గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ కోరారు. ఈ సందర్భంగా వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ మాట్లాడుతూ మా గ్రామం మీదుగా ఈ వెలుగోడు సింగల్ రోడ్డుపై అనేక ప్రాంతాల నుండి వాహనాలు రాకపోకలు జరుగుతున్నా యని ఇక్కడ కల్వర్టు సగానికి పడిపోవడం వలన చాలా ప్రమా దాలు జరిగి చాలామంది ప్రయాణికులకు కాళ్లు, చేతులకు గా యాలు, ఇతర చోట్ల గాయాలు పాలు కావడం జరిగిందని, చా లాసార్లు ప్రమాదాలు కూడా జరిగాయని అన్నారు. కనుక రోడ్డు భవనాల శాఖ అధికారులు త్వరగా స్పందించి ఈ కల్వర్టును వెంటనే నిర్మించి, రోడ్డు వేయాలని కోరారు.

## సీపీఐ నేతపై సీఐ దాడి హేయం

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**



**నేటి సాక్షి జూపాడుబంగ్లా:** ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించినందుకు డోన్ సీపీఐ మండల కార్యదర్శి నారాయణపై కక్షపూరితంగా దాడి చేసిన పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతిని ప్రశ్నిస్తే దాడులా? అవినీతి అక్రమాలను బయటపెడుతూ పేదలకు అండగా నిలిచిన నారాయణ, ఫిర్యాదు చేసేందుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. రాజకీయ ఒత్తిళ్లతో పట్టణ సీఐ అక్కడికి వచ్చి భౌతిక దాడికి పాల్పడటం చట్టవిరుద్ధమని రమేష్ బాబు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై పోలీసులు రౌడీల్లా వ్యవహరించడం సరికాదని ధ్వజమెత్తారు. తప్పు చేస్తే కోర్టులో హాజరుపరచాలి తప్ప, ఇలా స్టేషన్‌లో పెట్టి కొట్టడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాలను నిర్భయంగా బయటపెట్టే వారిని అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, దాడికి పాల్పడిన సీఐపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మక్బూల్ బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## తొగుటలో 'సీఎం కప్' క్రీడలు

**ముఖ్య అతిథిగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి**

**నేటి సాక్షి (వడ్డే నరసింహులు):** తొగుట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించనున్న మండల స్థాయి 'సీఎం కప్' క్రీడల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ క్రీడా సంబరంలో విశిష్ట అతిథులుగా దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), తొగుట సర్పంచ్ పాగల శోభ–కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి పాల్గొననున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆత్మ కమిటీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, NSUI నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి కోరారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# యువతతోనే రాజకీయ భవిష్యత్తు









- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్
- కోరుట్లలో బీఆర్ఎస్ పార్టీలో జోరుగా చేరికలు

**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో అనూహ్యంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరికల కార్యక్రమం ఘనంగా జరిగింది. కోరుట్ల పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరి రాజకీయంగా కీలక సందేశం ఇచ్చారు.

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి సుమారు 40 మంది యువకులు

కాంగ్రెస్ పార్టీకి చెందిన వీరబత్తిని దశరథంతో పాటు రౌతు శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో సుమారు 40 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గంద్ర శిల్ప ఆధ్వర్యంలో ఈ చేరికలు జరగగా, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ స్వయంగా నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

### 8వ వార్డు నుంచి పలువురు నేతలు, యువకుల చేరిక

అదే విధంగా కోరుట్ల పట్టణ 8వ వార్డుకు చెందిన తోట గంగాధర్, మాజీ కౌన్సిలర్ హమీద్ తో పాటు పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సంజయ్ సమక్షంలో జరిగిన ఈ చేరికలు పార్టీ బలాన్ని మరింత పెంచాయని నాయకులు పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ సంక్షేమ పాలన యువతను ఆకర్షిస్తోంది

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, యువతే దేశానికి, రాష్ట్రానికి భవిష్యత్తు అని స్పష్టం చేశారు. యువకుల భాగస్వామ్యంతోనే రాష్ట్రం, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులే యువతను ఆకర్షిస్తున్నాయని ఆయన అన్నారు.

### రానున్న ఎన్నికల్లో ఘన విజయం ఖాయం

ప్రజల విశ్వాసం, యువత మద్దతుతో బీఆర్ఎస్ పార్టీ కోరుట్లలో మరింత బలపడుతోందని నాయకులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే సంజయ్ స్పష్టం చేశారు.

# కేసీఆర్ సహకారంతో ప్రజ్ఞాపూర్‌లో వందల కోట్ల అభివృద్ధి

**నేటి సాక్షి, గజ్వేల్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందని ఆరో వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి బొగ్గుల స్వప్న సురేష్ తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఆమె ఆరో వార్డు అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రింగ్ రోడ్డు, మాతా–శిశు ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రి, మహతి ఆడిటోరియం, సమీకృత కూరగాయల మార్కెట్, ప్రజ్ఞాపూర్–తూప్రాన్ ప్రధాన రహదారి అభివృద్ధి, పాండాల చెరువు అభివృద్ధి వంటి కీలక పనులు కేసీఆర్ పాలనలోనే జరిగాయని అన్నారు. కేజీ టు పీజీ విద్యా సౌధం ద్వారా నిరుపేదలకు నాణ్యమైన విద్య అందుతోందని, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. గత 60 ఏళ్లలో జరగని అభివృద్ధి కేసీఆర్ పదేళ్ల పాలనలో సాధ్యమైందని చెప్పారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈదుగాని యాదగిరి, గుంద్ర రామచంద్రం, దాకాని బిక్షపతి, రొట్టెల శ్రీనివాస్, దొమ్మాట కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెర్మల్

**నేటి సాక్షి చేర్యాల:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల పట్టణంలోని నామినేషన్ కేంద్రాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెర్మల్ గురువారం సాయంత్రం సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షించిన ఆమె, అధికారులకు పలు సూచనలు చేశారు. రెండో రోజు నామినేషన్ల పర్వం ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు పోలీస్ శాఖకు సహకరించి ఎన్నికలను సజావుగా నిర్వహించేలా చూడాలని కోరారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి మున్సిపల్ అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్, సీఐ బానోతు రమేష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# గజ్వేల్‌లో బీజేపీ ప్రచారం జోరు..



- మోడీ పాలనకు మద్దతు వెల్లువ

**నేటి సాక్షి, గజ్వేల్:** వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ అందిస్తున్న స్వచ్ఛమైన పాలనకు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి అపూర్వ మద్దతు లభిస్తోందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి 14వ వార్డు బీజేపీ అభ్యర్థి మామిండ్ల రేణుక తెలిపారు. నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ సింధూర్' ద్వారా ఉగ్రవాద నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుందని, మోడీ పాలన వల్ల భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతి ఇంటికి బియ్యం పంపిణీ, మరుగుదొడ్ల నిర్మాణం, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. అయితే ఈ పనులకు తామే నిధులు కేటాయిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. గత 60 ఏళ్ల కాంగ్రెస్, 10 ఏళ్ల టీఆర్ఎస్ పాలనలో పేదలకు ఎలాంటి లాభం చేకూరలేదని, కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందుతోందన్నారు. ఎరువుల సరఫరా, పత్తికి గిట్టుబాటు ధర కల్పించడం వల్ల సాగు సజావుగా సాగుతోందని చెప్పారు. కరోనా సమయంలో కోట్లాది మందికి ఉచిత వ్యాక్సిన్ అందించి ప్రాణాలు కాపాడిన ప్రధాని మోడీకి దేశ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాగులు, ముదిరాజ్, లక్ష్మీనారాయణ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# జనరల్ అబ్జర్వర్‌ను కలిసిన జిల్లా కలెక్టర్

● జాతర పేరుతో అధిక ధరలు

**నేటి సాక్షి - జగిత్యాల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో నిర్వహించనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ఖర్టాడే కాళీచరణ్ సుదామ రావును జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జగిత్యాలలోని అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో కలెక్టర్ పూల మొక్కను అందజేసి అబ్జర్వర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికలు జరగనున్న ఐదు మున్సిపాలిటీలకు సంబంధించిన ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల సంఖ్య, భద్రతా చర్యలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. ఈ



సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్, ఆర్డీవో మధుసూదన్, డిపిఆర్వో పి. నరేష్, జిల్లా నోడల్ ఆఫీసర్ జి. శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ రాం మోహన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్న వారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని అనుమతించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు పూర్తి చేసిన అభ్యర్థులు హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

**నేటి సాక్షి:** ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. నాగేశ్వరరావు కథనం మేరకు... చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లి కి చెందిన సతీష్ 25 పుంగనూరులో ఉంటూ ఓ ప్రైవేటు పాల కంపెనీలో సాంకేతిక నిపుణుడిగా పనిచేసేవాడు. సొంత గ్రామమైన చిట్రెడ్డిపల్లిలో గృహాన్ని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో రుణాలు అధికంగా చేయడంతో ఆర్థిక భారం అధికమైంది. దీంతో సతీష్ తానా ఇండ్లు సమీపంలోని సచివాలయం వెనుక భాగంలో గడ్డి ముందు సేవించాడు మందు తాగిన తర్వాత అతని స్నేహితునికి తాను ఎక్కడున్నానో తెలిపి గడ్డి మందు తాగానని రక్షించాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే అతని స్నేహితుడు కుటుంబ సభ్యులతో వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ సతీష్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుని తండ్రి రెడ్డి శేఖర్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై



వివరించారు.

# భీమా పథకాలు కుటుంబాలకు కొండంత అండ

**మేడిపల్లి, నేటి సాక్షి:** కేంద్ర ప్రభుత్వ భీమా పథకాలు కష్టకాలంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తాయని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ దుమ్మని లక్ష్మణ్ అన్నారు. విద్యుత్ షాక్‌తో మరణించిన పసునూర్ గ్రామానికి చెందిన మాలోవత్ సత్యనాయక్ భార్యకు ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకం కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.456లతో భీమా సౌకర్యం పొందితే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.4 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షల భీమా లభిస్తుందని తెలిపారు. అలాగే బ్యాంకు డిపాజిట్లపై 8.5% వరకు అత్యధిక వడ్డీ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు



# ఎన్నికల కేంద్రాలను పరిశీలించిన వ్యయ పరిశీలకులు

**నేటి సాక్షి జగిత్యాల, (ఇమ్మడి విజయ్ కుమార్):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు డి. శ్రీనివాస్ గురువారం ధర్మపురి, జగిత్యాల మున్సిపాలిటీలలో నామినేషన్ల సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నియమావళిని పాటిస్తూ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిర్దేశించిన పరిమితి మేరకే వ్యయం చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించి బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. అభ్యర్థులు మరియు పార్టీల పరంగా జరిగే ప్రతి ఖర్చును సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు నిశితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు మరియు ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



# అమ్మవార్ల చెంత ఎమ్మెల్యే పల్లా పూజలు

చేర్యాల, నేటి సాక్షి: బచ్చన్నపేట మండలం మనసాన్ పల్లి గుబ్బడి గుట్టపై కొలువైన సమ్మక్క-సారలమ్మలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజల క్షేమం కోసం మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గీస



# పూర్తి నష్టపరిహారం అందించాలి



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నర్సింలు:** రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించిన తర్వాతనే కాలువ పునరుద్ధరణ పనులను చేపట్టాలని గ్రామ సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి కోరారు. మల్లన్న సాగర్ నుండి దుబ్బాక ప్రధాన కాలువలోని పూడిక తీయకుండా నీరు విడుదల చేయడం తో కాలువకు గండిపడి పెద్ద మాసన్ పల్లి గ్రామానికి చెందిన రైతులకు సుమారు 20 ఎకరాల పంట పొలాలు నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు ఎలాంటి హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీని ఇస్తేనే రైతులు కాలువ పనుల మరమ్మతులకు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయరన్నారు. వెంటనే అధికారులు స్పందించి రైతులకు ఏ రకంగా నష్టపరిహారాన్ని అందిస్తారో తెలియజేయాలన్నారు.

# ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



**నేటి సాక్షి, గంగాధర:** ఎస్టీయూ గోడ క్యాలెండర్‌ను గురువారం మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. ఉప్పరమల్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశంలో ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్‌కుమార్, మనుపాటి బుచ్చయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 29 వ.వార్డ్ కౌన్సిలర్‌గ అనిత



**నేటి సాక్షి కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని 29వ వార్డ్ భారతీయ జనతా పార్టీ బలపరిచిన డా. కొత్తపల్లి అనిత ఈరోజు మున్సిపల్ కార్యాలయం లో నామినేషన్ దాకలు చేశారు వీరితో పాటు ఎమ్మెల్యే. పాల్వాయి హరీష్ బాబు డాక్టర్. కొత్తపల్లి శ్రీనివాస్ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వినర్ అయ్యన్న భూమన్న పట్టణ అధ్యక్షులు శివ కుమార్ అరుణ్ లోయ వార్డు సభ్యులు బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# గోపాల్ కుటుంబానికి సాయం



**నేటి సాక్షి తొగుట. నరసింహులు:** గోవర్ధనగిరి (చిన్నముత్యంపేట)లో ఇటివల రోడ్ ఆక్సిడెంట్‌లో మరణించిన కాలియ గోపాల్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన తోగుట మండల ఉపాధ్యక్షులు నంట స్వామిరెడ్డి మరియు గ్రామ ఉపసర్పంచ్ తోయేటి శ్రీనివాస్ .వారికి ప్రభుత్వం తరపున రావాల్సిన పథకాలు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గోపాల్,మండల కిషన్ ఉప్పరి రాజు గుళ్ళ రాజు అయ్యవారి పరమేశ్వర్ కాలియ యాదగిరి తుమ్మల సురేష్ రేశం ప్రభాకర్ ఎయ్య కనకయ్య ఉప్పరి నరేష్ తోయేటి భాస్కర్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# జెండా పంచాయతీపై విచారణ

కూల్చిన గోడను పునర్నిర్మిస్తామన్న ఎంపీడీవో



**నేటి సాక్షి నారాయణపేట,( ఇమామ్ సాబ్):** మరికల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరణ వేదిక కోసం నెలకొన్న వివాదం ఎట్టకేలకు ముగిసింది. ఎంపీడీవో కార్యాలయ అనుమతి లేకుండా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది జెండా కోసం కాంపౌండ్ వాల్‌ను కూల్చివేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. రెండు ప్రభుత్వ శాఖల మధ్య తలెత్తిన ఈ వివాదంపై ఆయన సీరియస్‌గా స్పందించి విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో స్పందించిన ఎంపీడీవో పృథ్వీరాజ్, జెండా వేదిక కోసం కూల్చివేసిన కాంపౌండ్ వాల్‌ను తిరిగి నిర్మిస్తామని స్పష్టం చేశారు. దీంతో గత కొన్ని రోజులుగా అధికారుల మధ్య నడుస్తున్న 'జెండా పంచాయతీ' సద్దుమణిగింది. ప్రభుత్వ కార్యాలయాల మధ్య సమన్వయం ఉండాలని, ఆస్తుల నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.

# ఉపేందర్ రెడ్డి నామినేషన్





**నేటి సాక్షి, శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ తరపున న్యాయవాది ఉపేందర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గురువారం వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. గెలిస్తే వార్డులోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాడి రైతులకు 'నాబార్డ్' అండ

**చిలుకూరులో ఎఫ్పీఓ ఏర్పాటు**



**నేటి సాక్షి చిలుకూరు:** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా చిలుకూరు మండలంలో 'డైరీ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంస్థ' (FPO)ను ఏర్పాటు చేసినట్లు నాబార్డ్ డిడియం రవీందర్ నాయక్ తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులందరూ ఈ సంస్థలో సభ్యులుగా చేరి నాబార్డ్ అందించే రాయితీలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలను వివిధ ఉత్పత్తులుగా మార్చి (Value Addition) విక్రయించడం ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి వీరారెడ్డి, ఐఆర్డీఎస్ ప్రెసిడెంట్ వాడపల్లి రమేష్ మాట్లాడుతూ.. పాడి రైతులు సమిష్టిగా ఉండి ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల్ రెడ్డి, డైరెక్టర్లు రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ డంపింగ్ యార్డ్ దగ్ధం

**పేట ఫైర్ స్టేషన్ పోలీసుల పరిశీలన....**



**నేటి సాక్షి నారాయణపేట ఇమామ్ సాబ్ :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని ఇబ్రహీంపట్నం వెళ్లే రహదారిలో గల మరికల్ డంపింగ్ యార్డ్ గురువారం నారాయణపేట ఫైర్ స్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు. డంపింగ్ యార్డ్ మంటలను ఫైర్ స్టేషన్ పోలీసులు ఆర్పారు. ఇట్టి విషయంపై మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య, గ్రామ ఉపసర్పంచ్ కటిక కాజా, గ్రామ వార్డు సభ్యులు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరీష్ కుమార్, రఘు తదితరులు పరిశీలించారు.

# పంచాయతీ భవనం ప్రారంభం






**నేటిసాక్షి మిర్యాలగూడ,:** మండల పరిధిలోని లావుడి తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్‌తో కలిసి వారు కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన భవనం వారధిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావుడి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గిరిజ శేఖర్‌కు ఏకగ్రీవ మద్దతు



**శంకర్ పల్లి, నేటి సాక్షి:** శంకర్ పల్లి మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గుండా గిరిజ శేఖర్‌కు స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. గురువారం జరిగిన అసోసియేషన్ సభ్యుల సమావేశంలో గిరిజ శేఖర్ విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. వార్డు సమస్యల పట్ల అవగాహన ఉన్న యువకుడు శేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోనే 3వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఆయన గెలుపు అవసరమని పేర్కొన్నారు. ప్రతి సభ్యుడు వార్డులో చురుగ్గా ప్రచారం నిర్వహించి, గిరిజ శేఖర్ విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# రెండవ రోజు40 నామినేషన్‌లు




**నేటి సాక్షి, శంకర్‌పల్లి:** శంకర్ పల్లి మున్సిపల్ పోరుకు రెండవ రోజు 29వ తేదీన మొత్తం 40 నామినేషన్లు దాఖలు అయ్యాయని సహాయక జిల్లా ఎన్నికల అధికారి యోగేష్ తెలిపారు. బిజెపి పార్టీ నుండి 6, కాంగ్రెస్ పార్టీ నుండి 18, బి ఆర్ ఎస్ నుండి 10, ఇండిపెండెంట్ లు 5, బహుజన ఇన్సాన్ పార్టీ( బి ఐ పి) నుండి ఒకరు నామినేషన్ దాఖలు చేశారని ఎన్నికల అధికారి తెలిపారు.

# మేము చేసిన అభివృద్ధి చూసి ఓటెయ్యండి




- మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు
- 38 వార్డుల బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల
- అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** గత 10ఏడ్లల్లో మిర్యాలగూడలో మేము చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని మిర్యాలగూడ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మిర్యాలగూడ పట్టణాన్ని గత పదేళ్లలో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపామని, చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని ప్రజలను కోరుతున్నాం అన్నారు. పార్టీ క్రమ శిక్షణకు లోబడి పనిచేసే వారికే ఈసారి అవకాశం కల్పించామని, అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తాం" అని స్పష్టం చేశారు. అనంతరం పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశారు. మొత్తం 48 వార్డులకు గాను 38 వార్డుల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితాను మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్త, అధికారికంగా విడుదల చేశారు. అనంతరం, ప్రకటించిన అభ్యర్థులకు ఎన్నికల నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్త, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో గులాబీ జెండా ఎగిరేలా సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ తిప్పన విజయ సింహ రెడ్డి, యువనేత నల్లమోతు సిద్ధార్థ, యదవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నభిమోజు నాగార్జున చారి, నారాయణ రెడ్డి, వీరకోటి రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, కరుణాకర్ రెడ్డి, బాబయ్య, మక్దుం పాషా, ఇలియాజ్, మాజిద్, కట్టా మల్లేష్ గౌడ్, పిస్కే ప్రసాద్, బిక్షం గౌడ్, అశోక్ రెడ్డి, హతిరాం నాయక్, బాలు నాయక్, కోలా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి సాధ్యం మాజీ కౌన్సిలర్ కిషన్ రెడ్డి



**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో 13వ వార్డు టీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా మార్కంటి భాగ్యలక్ష్మి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అప్పులతో ఆత్మహత్య చేసుకున్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ అన్నపూర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. ఆకలితో అలమటించిన తెలంగాణ ప్రాంతంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి, సస్యశ్యామలంగా అభివృద్ధి చేసి దేశానికి అన్నం పెట్టే స్థాయికి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా సాగునీరు, తాగునీటి సమస్యలను పరిష్కరించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని గజ్వేల్ నుంచే దేశ ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించి, అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణలో అమలైన సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు కూడా వాటిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. అయితే గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ పట్టణ అభివృద్ధికి న్యాయ పైసా నిధులు కూడా కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దూర్ శ్రీనివాస్ రెడ్డి, 13వ వార్డు టీఆర్ఎస్ అభ్యర్థి మార్కంటి భాగ్యలక్ష్మి, కనకసేనలు, టీఆర్ ఎస్ నాయకులు పాల్గొని వార్డులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి భాగ్యలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

# ఊపందుకున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ



- కోరుట్లలో రెండో రోజు 84 సెట్ల నామినేషన్లు
- మెట్‌పల్లిలో 92 నామినేషన్ల దాఖలు

**నేటి సాక్షి - కోరుట్ల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ రెండో రోజుకు చేరుకున్న నేపథ్యంలో పోటీ వాతావరణం నెలకొంది. గురువారం రోజంతా నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి మద్దతుదారులతో సందడి కనిపించింది. రెండో రోజు మొత్తం 75 మంది అభ్యర్థులు 84 నామినేషన్ పత్రాలను సమర్పించారు.

**నామినేషన్ కేంద్రాల వద్ద సందడి**

నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో మున్సిపాలిటీ కార్యాలయం,ఎంపిడిఓ కార్యాలయం,సినారె భవన్ పరిసరాలు రాజకీయ హడావుడితో మార్మోగాయి. ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు కూడా పటిష్టంగా ఏర్పాటు చేశారు.

**మెట్‌పల్లి మున్సిపాలిటీలోనూ నామినేషన్ల హవా**

మెట్‌పల్లి మున్సిపాలిటీలో కూడా రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగింది. గురువారం మొత్తం 92 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. మొత్తం 83 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, వివిధ రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు సమర్పించారు.మెట్‌పల్లి మున్సిపాలిటీలో రెండో రోజు నామినేషన్లలో కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా 37 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, బీజేపీ నుంచి 23 మంది, బీఆర్ఎస్ నుంచి 18 మంది బరిలోకి దిగారు. అలాగే ఆప్ నుంచి 3 మంది, ఏఐఎంఐఎం నుంచి 4 మంది, స్వతంత్రులుగా 6 మంది నామినేషన్లు సమర్పించారు. గుర్తింపు పొందిన ఇతర పార్టీ నుంచి ఒక నామినేషన్ దాఖలైంది.

**పోటీ మరింత ఉత్కంఠభరితం**

రెండో రోజుతో నామినేషన్ ప్రక్రియ మరింత వేగం పుంజుకోవడంతో మున్సిపల్ ఎన్నికల పోటీ ఉత్కంఠభరితంగా మారుతోంది. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.

# ఎన్నికల కేంద్రాలను పరిశీలించిన డీసీపీ యోగేష్ గౌతమ్

**నేటి సాక్షి శంకర్ పల్లి :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శంకర్ పల్లి పట్టణంలోని నామినేషన్, డిస్ట్రిబ్యూషన్ మరియు కౌంటింగ్ కేంద్రాలను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) యోగేష్ గౌతమ్ గురువారం సందర్శించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. పోలింగ్ మరియు కౌంటింగ్ సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ యోగేష్, సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐలు మరియు ఇతర సిబ్బంది ఉన్నారు.





# పొద్దుగాల ‘బీఆర్ఎస్’ పొద్దుమీకి ‘కాంగ్రెస్’



- గంటల వ్యవధిలో మారిన ‘పొలిటికల్ సీన్’
- 30 ఏళ్లుగా నేను కాంగ్రెస్ కార్యకర్తనే
- ప్రచారంలో ఉన్న నాకు ఎమ్మెల్యే వచ్చి కండువా కప్పిండని తోట గంగాధర్ వివరణ
- మా పార్టీలో గెలిచే అభ్యర్థులను ‘బలిమీటికి’ కండువా కప్పుతుండ్రని జువ్వాడి ఆరోపణ
- కోరుట్లలో 26.. మెట్ పల్లిలో 18 సీట్లు మావే.. రెండు మున్సిపాలిటీల్లో జెండా ఎగరేస్తాం.!



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా కోరుట్లలో గురువారం రాజకీయంగా ఆసక్తికర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.పట్టణానికి చెంది న 8వవార్డు అభ్యర్థి తోట గంగాధర్ పొద్దున కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సమక్షంలో ‘బిఆర్ఎస్’ పార్టీలో చేరుతున్నట్టు ఆ పార్టీ ‘కండువా’ కప్పుకున్నాడు. అయితే..అనూహ్యంగా తోట గంగాధర్ పొద్దుగూకే వేళ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో ‘కాంగ్రెస్’ పార్టీలో చేరి కండువా కప్పుకోవడం తీవ్ర చర్చానీయాంశమైంది.!

## నేను 30 ఏళ్లుగా ‘కాంగ్రెస్’ పార్టీ కార్యకర్తను

### (‘కండువా’ నేత తోట గంగాధర్)

దివంగత మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు హయాంలో.30 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేశానని మీడియా ముందు పేర్కొన్నారు.అయితే, ప్రస్తుతం నాకు ఈ 8వ వార్డులో టికెట్ వస్తలేదని దుష్ప్రచారం జరిగిందని..కానీ తాను వార్డులో ప్రచారం చేసుకుంటుండగా ఎమ్మెల్యే మా ఇంటికొచ్చాడని తోట గంగాధర్ చెబుతున్నారు.వెంటనే ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ పార్టీలో టికెట్ రాలేదని బాధపడకు..నీకు అండగా నేనుంటా..నువ్ వెంటనే ‘బిఆర్ఎస్’ పార్టీలో చేరిపో అంటూ బలవంతంగా ‘కండువా’ కప్పారని గంగాధర్ పేర్కొన్నారు.

## మా పార్టీలోని బలమైన వారిని ‘బలిమీటికి’ పార్టీలో చేర్చుకుంటున్నరు

### (కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు)

మా కాంగ్రెస్ పార్టీకి చెందిన బలమైన.. గెలిచే అభ్యర్థులను.. ‘బలిమీటికి’ ..బిఆర్ఎస్ పార్టీలోకి చేర్చుకుంటున్నారని కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు మీడియా సమావేశంలో ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీలో ‘బీ-ఫారం’ ఇస్తలేరని బద్నాం చేస్తూ.. గెలిచే సత్తా ఉన్నా అభ్యర్థులకు మాయమాటలు చెప్పి ‘బిఆర్ఎస్’ పార్టీలోకి బలవంతంగా చేర్చుకుంటున్నారని ఆగ్రహించారు.

### కోరుట్లలో-26.. మెట్‌పల్లిలో-18 సీట్లు

## మా కాంగ్రెస్ పార్టీవే.!

మేం నిర్వహించిన మూడు సర్వేల్లో కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని.. కోరుట్ల మున్సిపల్‌లో 26 మంది కౌన్సిలర్‌లు.. మెట్‌పల్లి మున్సిపల్‌లో 18 మంది కౌన్సిలర్ లుగా విజయం సాధించనున్నారని జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు.కోరుట్ల-మెట్ పల్లి మున్సిపల్ భవనాలపై ‘కాంగ్రెస్ పార్టీ’ జెండా ఎగురవేయనున్నట్టు ప్రకటించారు. ప్రత్యర్థులు ఎన్ని గేమ్‌లు ఆడినా.. విజయం కాంగ్రెస్ పార్టీనే వరిస్తుందన్నారు.



## ఇంతకూ.. ఈ ‘ఉదంతం’లో ఏది నిజం?

కోరుట్లకు చెందిన తోట గంగాధర్ గురువారం ఉదయం ఎమ్మెల్యే సంజయ్ అధ్వర్యంలో బీఆర్ఎస్ కండువా కప్పుకొని ఆ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రచారం నిర్వహించారు.అదే రోజు సాయంత్రం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి జువ్వాడి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. పార్టీలో చేరికలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారినప్పటికీ.. నిజంగా అసలు ఈ ‘ఉదంతం’ వెనుక ఏం జరిగి ఉంటుందన్నది ఇప్పుడు చర్చానీయాంశమైంది.! తోట గంగాధర్ నిజంగా ప్రచారంలో ఉండగానే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వచ్చి కండువా కప్పిండన్నది నిజమా.? లేక..’టికెట్’ తనకు వచ్చే అవకాశాలు లేవని భావించి పార్టీ మారిండన్నది నిజమా.? ఇదిగాక ఫైనల్ గా..ఆయన ‘మొహమాటంగా’ ఓపార్టీ లోకి..’భయంభయంగా’ మరో పార్టీ లోకి వెళ్లిండాన్నది నిజమాని కోరుట్ల పట్టణంలో హాట్ హాట్ గా ముచ్చటించుకుంటున్నారు. ఏది కరెక్ట్? కోరుట్ల పట్టణంలో అసలు ఏం జరుగుతోందన్నది చర్చానీయాంశమైంది.!